తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## నియోజకవర్గ అభివృద్ధి పనులకు నిధులివ్వండి

**- డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ విజ్ఞప్తి చేసిన ఎమ్మెల్యే రామకృష్ణ**



వెంకటగిరి, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త నియోజకవర్గం అభివృద్ధికి నిధులు ఇవ్వాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ వినతి పత్రం అందజేశారు. అసెంబ్లీ సమావేశాలు సందర్భంగా డిప్యూటీ సీఎంను ఎమ్మెల్యే కలిశారు. వెంకటగిరి నియోజకవర్గంలో గ్రామీణ రోడ్లు దుస్థితిలో ఉన్నాయని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి విరివిగా నిధులు ఇవ్వాలని కోరారు. నిధులు ఇస్తానని డిప్యూటీ సీఎం ఎమ్మెల్యేకి తెలిపారు.

## 'కల్తీనెయ్యి'పై అసెంబ్లీలో చర్చ!

**-పాపం చేశారంటూ సిఎం భావోద్వేగ వ్యాఖ్యలు**



తిరుమల,పిబ్రవరి 24ప్రభాతవార్తప్రతినిధి:

కోట్లాదిమంది భక్తుల ఇలవేల్పు...శ్రీవేంకటేశ్వరస్వామి లడ్డూప్రసాదాలకు గత వైసిపి పెద్దలు కల్తీనెయ్యి సరఫరా చేశారనే దుమారం పై మంగళవారం అసెంబ్లీలో తీవ్రస్థాయిలో చర్చ సాగింది. తిరుపతి జిల్లా వాసి, కుప్పం నియోజకవర్గ ప్రాతినిథ్యం వహిస్తున్న చంద్రబాబు నాయుడు కల్తీనెయ్యి పై తీవ్రస్థాయిలో విషయాలు వెల్లడించారు. తిరుమల లడ్డూలకు 235కోట్ల రూపాయల విలువైన 60లక్షల కిలోల రసాయనాలు కలిపిన కల్తీనెయ్యి వాడారనే వివాదం రోజురోజుకూ పరిణామాలు వేడెక్కుతున్నాయి. అధికారపక్షం, వైసిపి ప్రజాప్రతినిధుల మధ్య గాలివానలా ఈ దుమారం చెలరేగుతోంది. ఈ కేసులో నిజాలు నిగ్గుతేల్చాలనే కోణంలో ప్రభుత్వం,మంత్రివర్గం విశ్రాంత ఐఏఎస్ అధికారి,మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేశ్‌కుమార్‌తో ఏకసభ్యకమిటీని నియమించింది.ఆయన బాద్యతలు చేపట్టక ముందే ఈ కేసులో కొందరిలో చెమటలుపట్టిస్తున్నాయి. ఆయన పూర్తిగా రంగంలోకి దిగితే ఆ తరువాత ఏ సమయంలో ఏం జరగనుందనేది మాత్రం టిటిడి మాజీ పెద్దల్లో ,టిటిడి అధికారుల్లో గుబులు రేకెత్తిస్తోంది. 234 కోట్ల రూపాయల మేరకు 59 లక్షల కిలోల కల్తీ నెయ్యి సరఫరా జరిగిందని ఆరోపణల్లో వాస్తవాలు తేల్చేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. నెయ్యికల్తీ అని తేలిన నివేదికను నాటి ఛైర్మన్ తొక్కిపెట్టారని సిఎం చంద్రబాబు వ్యాఖ్యలు చేశారు.అప్పట్లో టిటడి ఛైర్మన్ పీఏ 4.50 కోట్ల రూపాయల మేరకు లంచం తీసుకున్నారని ఆరోపణలు.టిటిడి కల్తీ నెయ్యి గురించి మాట్లాడింది జాతీయ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్ (ఎన్డీడీబీ) ఇచ్చిన నివేదిక ఆధారంగానేనని ముఖ్యమంత్రి శాసనసభలో స్పష్టం చేయడం ఇప్పుడు మరింతగా సంచలనంగా మారింది. గత ప్రభుత్వ హయాంలో టిటిడిలో జరిగిన అక్రమాలను, వ్యవస్థలను నిర్వీర్యం చేసిన తీరును పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సభ్యులకు కూలంకషంగా వివరించారు.ఈ సందర్భంగా సిఎంకూడా ఎవరికి ఏ కష్టం వచ్చినా వేంకటేశ్వరస్వామిని మొక్కుకుంటామని, అలాంటిది 2019-24 మధ్య స్వామివారికి జరిగిన అపచారం పట్ల ఎంతో ఆవేదన చెందామన్నారు.తనపై 23 క్లేమోర్ మైన్స్ దాడి జరిగినప్పుడు శ్రీవారే తనను కాపాడారని, ఆయన సేవలో ఉంటేనే రాష్ట్రానికి మంచి జరుగుతుందని తాను బలంగా నమ్ముతానని ఉద్వేగంగా ప్రసంగించారు. గత ప్రభుత్వ పెద్దల అండతో ఒక సిండికేట్‌గా ఏర్పడి ఈ కల్తీ నెయ్యి కుట్రకు పాల్పడ్డారని ఆరోపించారు. "టెండర్ నిబంధనలను ఉద్దేశపూర్వకంగా మార్చి, నాణ్యతా ప్రమాణాలను తగ్గించారని, 2022 మే నెలలోనే భోలేబాబా సంస్థ నెయ్యి నాణ్యతపై ఫిర్యాదు అందినా నివేదికను తొక్కిపెట్టారని అసెంబ్లీ వేదికగా వెల్లడించారు. అప్పట్లోనే దీనిపై చర్యలు తీసుకునుంటే ఇంత అపచారం జరిగేది కాదని విమర్శించారు. టిటిడిలో సాంకేతిక నిపుణులకు ఖరీదైన ఫోన్లు ఎరవేసి కల్తీకి గేట్లు తెరిచారని, సిట్ దర్యాప్తులో లంచాల వివరాలతో కూడిన డైరీ, మోనో గ్లిసరైట్, ఎసిటిక్ యాసిడ్ లాంటి రసాయనాల డ్రమ్ములు బయటపడ్డాయని వెల్లడించారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ఈ అంశంపై సిట్ వేశామని, అయితే వైసీపీ నేతలు సుప్రీంకోర్టుకు వెళ్లి దానిని అడ్డుకునే ప్రయత్నం చేశారన్నారు.అయినా సుప్రీంకోర్టు సీబీఐ ఆధ్వర్యంలో విచారణకు ఆదేశించిందని గుర్తుచేశారు. ఎన్‌డిడీబీ నివేదిక ఆధారంగానే తాను కల్తీ జరిగిందని చెప్పానని మరోసారి సిఎం అసెంబ్లీలో స్పష్టం చేశారు.

# ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేస్తే నాకేంటీ!

**బదిలీ ఉత్తర్వులు వచ్చి వారం రోజులైనా విధులు నిర్వహిస్తున్న డిఎంహెచ్ఓ డాక్టర్ సుధారాణి**



చిత్తూరు, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:

కొంతమంది అధికారులకు మాత్రమే ప్రభుత్వం జారీ చేసే ఉత్తర్వులు తక్షణం అమలులోకి వస్తాయి. ప్రభుత్వం వద్ద పలుకుబడి వుంటే ఉత్తర్వులు జారీ అయినప్పటికీ ఆ ఉత్తర్వులతో తనకేంటీ పని అనే విధంగా మరికొంత మంది అధికారులు వ్యవహరిస్తుంటారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో ప్రస్తుతం ఇదే తరహాలో బదిలీ ఉత్తర్వులు జారీ అయితే తనకేంటీ అని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అదికారి డాక్టర్ డిటి సుధారాణి నిశ్చలంగా విధులకు హాజరై తన పనులను చక్కబెట్టుకుంట ున్నారు. ప్రభుత్వం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ డిటి సుధారాణిని బదిలీ చేస్తూ ఆమె స్థానంలో అనంతపురం జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ ఎ.నాగ శశిభూషన్‌ను నియమిస్తూ ఈ నెల 17వ తేదీన ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులు జారీ అయి 8 రోజులు కావస్తున్నప్పటికీ డాక్టర్ ఎ.నాగ శశిభూషన్ చిత్తూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా వచ్చి బాధ్యతలు స్వీకరించలేదు. మరోవైపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ డిటి సుధారాణి ఇక్కడి నుండి రిలీవ్ కాలేదు. ప్రస్తుతం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ డిటి సుధారాణిపై గతంలో డిఎంహెచ్ఓలుగా విధులు నిర్వర్తించిన ఎవ్వరిపై లేని విధంగా అవినీతి ఆరోపణలు వున్నాయి. డిఎంహెచ్ఓ కార్యాలయంలో ఏదైనా పని కోసం వెళితే కచ్చితంగా డిఎంహెచ్ఓ కార్యాలయ అధికారుల చేతులు తడపందే పనులు కావని ఇటీవల కాలంలో సాధారణం అయ్యాయని వైద్య ఆరోగ్య సిబ్బంది పేర్కొంటున్నారు. ఇటీవల జరిగిన సచివాలయ ఎఎన్ఎంల బదిలీ కౌన్సెలింగ్‌లో భారీ అక్రమాలు జరిగాయని, సచివాలయ ఎఎన్ఎంలకు అనుకూలమైన ప్రదేశాల్లో పోస్టింగ్ ఇవ్వడానికి ఒకొక్కరి నుండి పెద్ద మొత్తంలో వసూలు చేసి వారికి అనుకూలమైన ప్రదేశాల్లో పోస్టింగ్ ఇచ్చారని ఆరోపణలు వున్నాయి. ఈ వ్యవహారంలో ప్రధాన సూత్రదారులు వేరుగా వున్నప్పటికీ కార్యాలయంలో విధులు నిర్వర్తించే ఓ జూనియర్ అసిస్టెంట్ ఫోన్‌పేకు కొంతమంది సచివాలయ ఎఎన్ఎంలు భారీ మొత్తంలో డబ్బులు పంపారని తెలియడంతో ఈ వ్యవహారంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ సైతం సీరియస్‌గా స్పందించి ఆ జూనియర్ అసిస్టెంట్‌ను కొద్ది రోజుల పాటు కలెక్టరేట్‌లో డిప్యుటేషన్ వేశారు. అయితే సచివాలయ ఎఎన్ఎంల బదిలీ వ్యవహారంలో భారీగా వసూళ్ళకు పాల్పడిన వ్యక్తులు బహిర్గతం కాకుండా ఓ జూనియర్ అసిస్టెంట్‌ను మాత్రం బలిపశువు చేశారని అప్పట్లో ఆరోపణలు మిన్నంటాయి. అలాగే డిఎంహెచ్ఓ కార్యాలయ పరిధిలో జరిగిన బదిలీలు, పదోన్నతుల కౌన్సెలింగ్‌లో సైతం భారీ అక్రమాలు జరిగాయని డిఎంహెచ్ఓ కార్యాలయ వర్గాలనే బహిరంగంగా చర్చించుకున్నాయి. అయితే ఈ వ్యవహారంలో కార్యాలయ కీలక అధికారి హస్తం వుండటంతో బహిర్గతం కావడానికి డిఎంహెచ్ఓ కార్యాలయ అధికారులు జంకారు. డిఎంహెచ్ఓగా విధులు నిర్వర్తించిన అనతి కాలంలోనే భారీ అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రస్తుత డిఎంహెచ్ఓ డాక్టర్ డిటి సుధారాణిని ప్రభుత్వం బదిలీ చేసినా ఆమె రిలీవ్ కాకపోవడం, కొత్తగా నియమితులైన డిఎంహెచ్ఓ బాధ్యతలు స్వీకరించకపోవడం పట్ల ప్రభుత్వం జారీ చేసే ఉత్తర్వులు కొంతమంది అధికారులకు మాత్రమే వర్తిస్తుందని, తమ గుప్పెట్లో ప్రభుత్వంను పెట్టుకున్న వారికి ఏ మాత్రం వర్తించవనే విషయంను చిత్తూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బదిలీ వ్యవహారంలో బహిర్గతం అయ్యింది.

కొనసాగింపునకు ప్రయత్నిస్తుంటే.. బదిలీనా! 4వ పేజీలో

## చాగంటిని సత్కరించిన దేవస్థానం



శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 24 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయం ప్రముఖ ప్రవచన కర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావును ఘనంగా సత్కరించారు.మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ధూర్జటి కళా ప్రాంగణంలో ప్రవచ కార్యక్రమాలు ఏర్పాటు చేసారు.విశేష భక్తులు హాజరైన సభకు పట్టణ ప్రముఖులు మాజరయ్యారు. ఈ సందర్భంగా సుమారు రెండుగంటల పాటు ఆధ్యాత్మిక ప్రవచనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చాగంటి కోటేశ్వరరావు దంపతులను సభావేదికపై ఘనంగా సత్కరించారు. ఆలయం తరఫున ఇఓ బాపిరెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మెన్ కొట్టెసాయి ప్రసాద్, శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి మాతృమూర్తి బొజ్జల బృందమ్మ, సతీమణి బొజ్జల రిషితారెడ్డిలు సత్కరించారు. వేదపండితులు ప్రత్యేకంగా ఆయన్ను కలసి సత్కరించారు.ఈ కార్యక్రమాల్లో బోర్డు సభ్యులు వాకచర్ల గురప్పశెట్టి,గోపినాథ్,చాగణం శైలజ, దండి రాఘవయ్య,లక్ష్మమ్మ, ఇతర బోర్డు సభ్యులు పాల్గొన్నారు.వేదిక నిర్వాహాకులు విజయసారధి, హేమామాలిని, దుర్గా ప్రసాద్‌లు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

## తిరుపతిరూరల్ ఎంపిడిఓ పోస్టింగ్‌పై సందిగ్ధం



**మస్తాన్ వల్లీ ఎంపిడిఓగా బాధ్యతలు తీసుకున్నారా? లేక వేచిచూస్తున్నారా?**

తిరుపతిరూరల్, ఫిబ్రవరి24 ప్రభాతవార్త:

తిరుపతిరూరల్ మండలంలో ఎంపిడిఓ బాధ్యతల అంశం ప్రస్తుతం చర్చనీ యాంశంగా మారింది. అన్నమయ్య జిల్లా, మదనపల్లి మండల ప్రజాపరిషత్‌లో పరిపాలన అధికారిగా పనిచేస్తున్న మస్తాన్ వల్లి పదోన్నతిపై తిరుపతిరూరల్ ఎంపిడిఓగా బదిలీ అయ్యారు. అయితే మంగళవారం ఆయన బాధ్యతలు స్వీకరించారా లేదా అన్నది ఇంకా స్పష్టతకు రాలేదు.

**కార్యాలయానికి వచ్చి... ఎంపిపిని కలిసిన మస్తాన్ వల్లి**

మంగళవారం తిరుపతిరూరల్ ఎంపిడిఓ కార్యాలయానికి విచ్చేసిన మస్తాన్ వల్లి మర్యాదపూర్వకంగా మండలాధ్యక్షుడు విడుదల మాధవరెడ్డిని కలిశారు. మండల అభివృద్ధిపై పలు అంశాలను చర్చించినట్లు సమాచారం. అనంతరం హుటాహుటీనా జడ్పిసివోను కలిసేందుకు చిత్తూరు వెళ్లినట్లు తెలుస్తోంది. ఆ తర్వాత బాధ్యతల స్వీకరణపై ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. దీంతో ఉద్యోగ వర్గాలు, స్థానిక ప్రజల్లో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**ఇన్‌చార్జి వ్యవస్థ కొనసాగుతుందా?**

గతంలో ఇక్కడ ఎంపిడివోగా పనిచేసిన రామచంద్ర సెప్టెంబర్‌లో పదోన్నతిపై బదిలీ అయ్యారు. అప్పటి నుంచి దయాసాగర్ ఇన్‌చార్జి ఎంపిడివోగా విధులు నిర్వహిస్తున్నారు. రెగ్యులర్ ఎంపిడివో బాధ్యతలు ఇంకా చేపట్టకపోవడం వల్ల ఇన్‌చార్జి వ్యవస్థ కొనసాగుతుందా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**రాజకీయ కారణాలున్నాయా?**

స్థానికంగా వినిపిస్తున్న అభిప్రాయాల ప్రకారం రెగ్యులర్ ఎంపిడివోగా బాధ్యతలు స్వీకరించడంలో రాజకీయ పరమైన కారణాలు ఉండవచ్చనే ఉహాగానాలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా మండలంలో పలు అభివృద్ధి పనులు, పంచాయతీ నిధుల వినియోగం, పరిపాలనా మార్పులు వంటి అంశాలు సున్నితంగా మారిన నేపథ్యంలో నియామక ప్రక్రియ ఆలస్యం అవుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

**అధికారిక ప్రకటన కోసం ఎదురు చూపులు**

మస్తాన్ వల్లి బాధ్యతలు స్వీకరించారా? లేక మరికొన్ని పరిపాలనా ప్రక్రియలు పూర్తయ్యాక చార్జ్ తీసుకుంటారా? అన్న అంశంపై అధికారిక ప్రకటన వెలువడితేనే స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికైనా జిల్లాస్థాయి అధికారులు స్పష్టతనిచ్చి మండల పరిపాలనలో నెలకున్న సందిగ్ధానికి తెరదించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## కాణిపాకం హుండీల ద్వారా రూ.1.30 కోట్లు ఆదాయం



కాణిపాకంలో హుండీ లెక్కింపు నిర్వహిస్తున్న ఆలయ సిబ్బంది

కాణిపాకం, పిబ్రవరి 24 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంకు హుండీ లెక్కింపు ద్వారా 1.30 కోట్లు రూపాయలు ఆదాయంగా వచ్చింది. బుధవారం స్థానిక ఆస్థాన మండపంలో ఆలయ ఛైర్మన్ మణినాయుడు, ఈఓ కె.పెంచలకిషోర్‌ల ఆధ్వర్యంలో ఆలయ హుండీలను లెక్కించారు. ఈసందర్భంగా 18 రోజులకు హుండీల ద్వారా 1,30,10,749 రూపాయలు ఆదాయంగా లభించింది. అలాగే 88 గ్రాముల బంగారు, ఒక కిలో 189 గ్రాముల వెండి ఆదాయంగా వచ్చింది. అలాగే గోసంరక్షణ హుండీ ద్వారా 12,832 రూపాయలు ఆదాయంగా వచ్చింది. నిత్యాన్నదాన హుండీ ద్వారా 87,484 రూపాయలు ఆదాయంగా లభించింది. దీనితో పాటు 340 అమెరికా డాలర్లు, 100 ఆస్ట్రేలియా డాలర్లు, 69 మలేషియా రింగిట్స్,40 కెనడా డాలర్లు, 20 ఇంగ్లాండ్ ఫౌండ్స్ 5 సౌదీ రియాల్స్ ఆదాయంగా వచ్చినట్లు ఆలయ ఈఓ పెంచల కిషోర్ తెలిపారు. లెక్కింపు కార్యక్రమంలో దేవస్థానం ఛైర్మన్ వి.మణినాయుడు, దేవాదాయశాఖ జిల్లాఅసిస్టెంట్ కమీషనర్ చిట్టెమ్మ, పాలకమండలి సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి, ఏఈఓలు ఎస్వీ.కృష్ణారెడ్డి, హిమాధవిరెడ్డి ధనపాల్, సీఎఫ్ఓ నాగేశ్వరరావు, సూపరెండెంట్‌లు కోదండపాణి, శ్రీధర్‌బాబు, కాణిపాకం యూనియన్ బ్యాంకు, ఆలయ సిబ్బంది, సేవకులు పాల్గొన్నారు.

## దోచుకోవడం... దాచుకోవడం...!

**నర్సింగ్ విద్యార్థులకు చుక్కలు చూపుతున్న ప్రైవేటు కళాశాలలు**
**నిబంధనలకు విరుద్ధంగా ఫేక్ డాక్యుమెంట్స్ తో కళాశాలల నిర్వహణ**
**సర్టిఫికేట్లను అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్న వైనం**
**నిద్రావస్థలో ప్రభుత్వ యంత్రాంగం..మండ్యం విద్యాసంస్థలపై విచారణ చేపట్టరా...!**



తిరుపతి విద్య ఫిబ్రవరి 24 ప్రభాతవార్త

తిరుపతి జిల్లాలో ప్రైవేటు నర్సింగ్ కళాశాలలు రెచ్చిపోతున్నాయి. దోచుకోవడం...దాచుకోవడమే తమ సిద్ధాంతం అంటూ బహిరంగంగానే ప్రకటిస్తున్నా ప్రభుత్వ యంత్రాంగం పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అడ్మిషన్ల సమయంలో తల్లిదండ్రులకు మాయమాటలు చెప్పి విద్యార్థులను తమ సంస్థలో చేర్పించుకుని తర్వాత తమ విశ్వరూపాన్ని ప్రదర్శిస్తున్నారు. విచ్చలవిడిగా ఫీజుల పేరుతో లక్షలు వసూలు చేసి తల్లిదండ్రులకు నరకం చూపిస్తున్నారు. దీంతో విద్యార్థులు మానసికంగా కుంగిపోతున్నారు. కొంతమంది విద్యార్థులకు ఫీజులు చెల్లించలేదని కారణం చూపి కోర్సులు పూర్తి చేసినా సర్టిఫికేట్లు ఇవ్వకుండా కాలేజీల చుట్టూ తిప్పుకుంటున్నారు. ఈ కోవలోకి చెందిన మండ్యం విద్యాసంస్థలలో విద్యార్థుల పరిస్థితి మరీ ఘోరంగా తయారైంది.

**ఫేక్ డాక్యుమెంట్లతో కళాశాల నిర్వహణ.**

తిరుపతి జిల్లాలో మండ్యం గ్రూప్ పేరుతో నడుస్తున్న పలు కళాశాలలపై తక్షణం సమగ్ర విచారణ జరపాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి.ఆ విద్యాసంస్థల పేరుతో నిబంధనలకు విరుద్ధంగా నర్సింగ్, బీపీటీ, బీఈడీ, ఎంఈడీ కళాశాలలు నడిపిస్తున్నారు. కళాశాలల్లో మౌలిక వసతులు ఉండవు, అర్హతగల ఫ్యాకల్టీ ఉండరు, అధిక ఫీజుల వసూళ్లు, విద్యార్థులపై వేధింపులతో ప్రతినిత్యం టార్చర్ చూపిస్తున్నారు.సాక్షాత్తు విద్యార్థుల తల్లిదండ్రులే తమ గోడును బహిరంగంగా పలు మార్లు వెల్లడించిన అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడంపై విద్యార్థి సంఘాలు మండిపడ్డా యి. మండ్యం నర్సింగ్ కళాశాలలో సమస్యలు విలయతాండవమాడుతన్నా పలు మార్లు ఆ సంస్థపై గతంలో ఆరోపణలు ఉన్నాయని, కళాశాల సైతం ఫేక్ డాక్యుమెంట్లతో గుర్తింపు పొందారని, ప్రతి అంశంలోని యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి విద్యార్థులకు నరకం చూపిస్తున్నారని విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్వీయూ వీసీకి ఫిర్యాదు చేశారు. కళాశాలపై వస్తున్న ఆరోపణలపై ప్రత్యేకంగా మీటింగ్ ఏర్పాటు చేసి అన్ని వివరాలు పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. కానీ ఇప్పటివరకు విచారణచేపట్టకపోవడంపైవిమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**సర్టిఫికెట్ల దందాతో లక్షలు దోచుకుంటూ.**

మండ్యం విద్యాసంస్థల ముసుగులో నర్సింగ్ మాఫియా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోంది. ఆ కళాశాలకు చెందిన యాజమాన్యాలతో లింకులు పెట్టుకుని తరగతులకు హాజరుకాకపోయిన నర్సింగ్ కోర్సులకు సంబంధించిన సర్టిఫికేట్లను అనధికారికంగా జారీ చేస్తున్నట్లు సమాచారం. నర్సింగ్తో పాటు బీఈడీ, బీపీటీ ధృవపత్రాలను సైతం లక్షలకు అమ్ముకునిసొమ్ము చేసుకుంటున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎస్వీయూ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, ఎన్టీఆర్ వర్సిటీ తక్షణం కళాశాల మండ్యం కళాశాల అనుమతులపైనా, విమర్శలు ఎదుర్కొంటున్న ప్రతి అంశంపైనా సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

### మండ్యం కళాశాల గుర్తింపును రద్దు చేయండి

**తిరుమలేష్ .బి.సి విద్యార్థి సంక్షేమ సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షుడు**



నిబంధనలకు విరుద్ధంగా ఫేక్ డాక్యుమెంట్లతో అనుమతులు పొంది పలు కళాశాలను నడుపుతున్న మండ్యం విద్యాసంస్థల గుర్తింపును వెంటనే రద్దు చేయాలి.పేద విద్యార్థుల నుంచి లక్షల్లో అనధికారికంగా ఫీజులు వసూలు చేసి తల్లిదండ్రులకు నరకం చూపిస్తున్నారు. హాస్టల్లో మౌళికసదుపాయాలు లేకుండా విద్యార్థులను హింసిస్తున్నారు. ధనార్జనే ధ్యేయంగా విద్యను వ్యాపారం చేసి లక్షలు దోచుకుంటున్నారు. ఎస్వీయూ, వైద్యశాఖ అధికారులు తక్షణం ఆ కళాశాలపై విచారణ చేపట్టి కఠిన చర్యలు తీసుకోవాలి. లేనిపక్షంలో విద్యార్థి సంఘాలతో కలసి పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తాం.

## సర్పంచ్ కుర్చీ కోసం పోటా పోటీ

**- అధికార పార్టీలో**
**నలుగురు అభ్యర్థులు తీవ్ర ప్రయత్నాలు**

యాదమరి, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:

గ్రామ పంచాయతీ పాలకవర్గాల గడువు ముగియనుండటం, ఎలక్షన్ కమీషన్ పంచాయతీ ఎన్నికల కసరత్తు ప్రారంభించడంతో మండల కేంద్రం యాదమరి సర్పంచ్ పదవి కోసం పోటీ తీవ్రమైంది. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో వుండటంతో యాదమరి సర్పంచ్ స్థానంను దక్కించుకోవచ్చునని ఆ పార్టీ నాయకులు భావిస్తున్నారు. ఈ మేరకు అధికార పార్టీ మద్దతుతో ఎన్నికల బరిలో నిలవడానికి ఇప్పటికే నలురుగు అభ్యర్థులు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. యాదమరి సర్పంచ్ స్థానం ఎస్సీ(జనరల్), ఎస్సీ(మహిళ) కోటా పూర్తి కావడంతో ప్రస్తుతం బిసీ లేదా ఓసీలకు సర్పంచ్ పదవి రిజర్వ్ అయ్యే అవకాశం వుంది. ఈ మేరకు ఓసీ జనరల్ లేదా మహిళ అయినా ఈ స్థానం నుండి బిసీ జనరల్ లేదా బిసీ మహిళ పోటీ చేసే అవకాశం వుండటంతో ఇటు జనరల్ అభ్యర్థులు అటు బిసీ అభ్యర్థులు సర్పంచ్‌గా పోటీ చేయడానికి అధికార పార్టీ మద్దతుతో అభ్యర్థిగా పోటీ చేయడానికి సిద్ధమవుతున్నారు. ఇప్పటికే రెండు సార్లు సర్పంచ్‌గా వున్న వినాయకం గౌండర్ ఈ సారి మళ్ళీ సర్పంచ్‌గా పోటీ చేయడానికి క్షేత్ర స్థాయిలో రంగం సిద్ధం చేసుకుంటున్నారు. మరోవైపు ఎలాంటి రాజకీయ అనుభవం లేని యువకుడు యాదమరికి చెందిన సతీష్‌కుమార్ సర్పంచ్ పదవికి పోటీ చేయాలని నిర్ణయించి ముందుకు వెళ్తున్నాడు. అలాగే తెలుగుదేశం ఆవిర్భావం సమయంలో యాదమరి మండల పార్టీలో క్రియాశీలంగా వున్న రవీంద్రమొదలియార్ ఈ సారి ఎలాగైనా సర్పంచ్‌గా పోటీ చేయాలని ప్రయత్నాలు చేస్తున్నారు. అలాగే ఇప్పటికే రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా వున్న నాగరాజు సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేయడానికి రంగం సిద్ధం చేసుకుంటున్నాడు. పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ పార్టీ మద్దతుతో వీరిలో ఒకరిని సర్పంచ్ అభ్యర్థిగా ఖరారు చేయాలని భావిస్తున్నట్లు సమాచారం.

అయితే ఇందులో ఒకరిద్దరు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్‌కు సన్నిహితంగా వుంటున్నారు. వీరిలో ఈ సారి అధికార తెలుగుదేశం పార్టీ యాదమరి సర్పంచ్ అభ్యర్థిగా చేసే ఎవరికి మద్దతు ఇస్తుందనే విషయంపై చర్చనీయాంశమైంది. ఈ క్రమంలో పంచాయతీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగుతాయని నమ్మకం ఏర్పడితే ఇక్కడి నుండి ప్రతిపక్ష వైకాపా మద్దతుతో సర్పంచ్‌గా పోటీ చేయడానికి ఆ పార్టీ ఇప్పటికే ఒకరిని సిద్ధం చేసి వుంచింది. ఈ పరిస్థితుల్లో యాదమరి పంచాయతీ ఎన్నికల్లో ఎవరెవరు పోటీ చేస్తారనే విషయంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

## జోరుగా వైసిపి క్యాడర్ రిజిస్ట్రేషన్



పుత్తూరు (నగరి), ఫిబ్రవరి 24 ప్రభాతవార్త :

నగరి పట్టణంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ క్యాడర్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం జోరుగా సాగుతోంది. మంగళవారం పార్టీ పట్టణ అధ్యక్షుడు రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో మునిసిపాలిటీలోని 9, 10 వార్డులకు సంబంధించి క్యాడర్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 10వ వార్డు అధ్యక్షుడిగా నూర్‌ను నియమించారు. ప్రతి కార్యకర్త పార్టీ బలోపేతానికి పనిచేయాలని రమేష్ రెడ్డి కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు

వి.కోట, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త

బైరెడ్డిపల్లి ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సిడిపిఓ అరుణశ్రీ కోరారు. వి.కోట, బైరెడ్డిపల్లి మండలాల్లో ఒక అంగన్‌వాడీ టీచరు, నలభైమంది సహాయకుల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసినట్లు చెప్పారు. దరఖాస్తుదారులు ఆయా గ్రామాల పరిధిలో స్థానికులై వివాహితులుగా ఉండాలన్నారు. దరఖాస్తులను ఈనెల 25నుంచి మార్చి 6వతేదీ లోగా కార్యాలయ పనివేళల్లో అందజేయవచ్చన్నారు. వివరాలకు ఐసిడిఎస్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

## మోడల్ స్కూల్ విద్యార్థులకు మాత్రల పంపిణీ

బైరెడ్డిపల్లి, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త

జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మంగళవారం తీర్థం పిహెచ్‌సి డా॥ పద్మావతి అధ్వర్యంలో ఎపి మోడల్ స్కూల్ విద్యార్థులకు అల్బెండాజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యక్తిగత శుభ్రత లేకుండా చేతులు సరిగ్గా కడగకుండా అపరిశుభ్రత పాటిస్తే అనీమియా వ్యాధి తలెత్తే ప్రమాదం ఉందన్నారు. విద్యార్థులు పోషకాహారం తీసుకోవడంతో పాటు పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్టాఫ్ నర్స్ రాధాకుమారి, ఆశ, సుమిత్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నడిమూరు ఆదర్శ పాఠశాలలో ప్రవేశంకు దరఖాస్తులు

కుప్పం, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త

మండలంలోని నడిమూరు వద్ద ఉన్న ఎపి మోడల్ స్కూల్లో 2026-27సం॥కుగాను ఆరో తరగతిలో చేరేందుకు ఆసక్తిగల విద్యార్థులు మార్చి నెల 31 వతేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ విజయ్ కోరారు. ఎస్సీ,ఎస్టీ విద్యార్థులకు పరీక్ష రుసుం రూ 125, బిసి, ఒసి విద్యార్థులకు రూ 150లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు పాఠశాలలో సంప్రదించాలని కోరారు.

## ఎఐటియుసి రాష్ట్ర 18వ మహాసభలను జయప్రదం చేయండి

తిరుపతి హెల్త్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త




ఏఐటీయూసీ రాష్ట్ర 18వ మహాసభలు ఏప్రిల్ 26, 27, 28, 29 తేదీలలో తిరుపతిలో జరుగుతున్న మహాసభలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఏఐటియుసి, రాష్ట్ర అధ్యక్షులు ఆర్ రవీంద్రనాథ్ మాట్లాడుతూ 105 సంవత్సరాలు పూర్తి చేసుకుని 106వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ఎఐటియుసి 105 సంవత్సరాల కాలంలో కార్మికుల హక్కుల సాధనలో, చట్టాల రూపకల్పనలో, కార్మికులు రక్షణ కల్పించడంలో, కనీస వేతనాల సాధన, ఎనిమిది గంటల పని విధానం అమలుపరచడం ఉద్యోగ కార్మికులకు అండగా, ఉద్యోగ భద్రత కోసం, రాజకీయ వేదింపులకు వ్యతిరేకంగా, కార్మికులకు అండగా నిలిచి రాజీలేని పోరాటాల ద్వారా కార్మిక సమస్యల పరిష్కరిం చడంలో అండగా ఉంటూ అంచలంచలుగా ఎదిగి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలను రాజీలేని పోరాటాలు సాగిస్తూ కార్మికుల తలలో నాలుగుగా ఉంటున్న ఏఐటియుసి రాష్ట్ర మహాసభలో తిరుపతి గడ్డపై జరుగుతున్నాయి. ఈ మహాసభలో జయప్రదం కోసం అందరూ సహకరించి జయప్రదం చేయాలని ఏఐటియుసి, రాష్ట్ర అధ్యక్షులు ఆర్ రవీంద్రనాథ్ కోరారు. కార్మిక వ్యతిరేక విధానాలన రాష్ట్రంలో చంద్రబాబు కూటమి ప్రభుత్వం ఇతర రాష్ట్రాలలో ఎవ్వరు చేయన్ని సాహసం చేస్తూ లేబర్ కోడ్లు అమలును చరవేగంగా అమలు చేస్తున్నారు. కార్మిక వ్యతిరేక విధానాలపై రాజీ పోరాటాలను ఎఐటియుసి సాగిస్తూ కార్మికులకు అండగా వుంటూ గడిచిన 4 సంవత్సరాల కాలంలో చేపట్టిన పోరాటాలు వచ్చిన విజయాలు సమీక్షించుకుని రాబోయే కాలంలో నిర్వహించాల్సిన పోరాటాలకు కార్మిక వర్గాన్ని ఐక్యపరిచి సమీకరించడానికి కావల్సిన ప్రణాళికను ఈ రాష్ట్ర 18వ మహసభలలో చర్చించి నిర్ణయం జరుగుతుంది. ఈ మహాసభలకు రాష్ట్ర నలుమూలల నుండి 28 జిల్లాల నుండి 500 మందికి పైగా కార్మిక నేతలు ప్రతినిధులుగా హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎన్. చంద్రశేఖరెడ్డి, కె. రాధాకృష్ణ, తిరుపతి నగర కార్యదర్శి ఎన్.డి. రవి,గోవింద్ స్వామి, వైయస్ మనీ, ఏపీ బాల వెంకటేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గోవిందుని భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించండి

పాకాల, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త



పాకాల మండలం పూతలపట్టు - నాయుడుపేట జాతీయ రహదారి శంఖంపల్లి వద్ద స్వయంభు శ్రీ వీరాంజనేయ అనంతరాయుల గుడి వద్ద నిత్యం గోవింద మాలలు ధరించిన భక్తులు తిరుమల తిరుపతి కలియుగ శ్రీ వెంకటేశ్వర స్వామి దర్శన నిమిత్తం వేల సంఖ్యలో పాదచారులు నిత్యం కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి తిరుమల కొండకు స్వామి దర్శనం నిమిత్తం తమ మొక్కులు చెల్లించుకొనుటకు ఈ మార్గంలో రాత్రి పగలు అని తేడా లేకుండా కాలి నడకన ప్రయాణించిన భక్తులు ఇక్కడ కొంతసేపు సేద తీరుతున్నారు. వారికి కనీస సౌకర్యాలు అయినటువంటి స్నానపు గదులు కానీ మరుగుదొడ్లు కానీ లేక మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం వారు గోవిందుని భక్తుల కొరకు ఈ గుడి దగ్గర మరుగుదొడ్లు స్థానపు గదులు సేద తీరుట కొరకు కొన్ని షెడ్లు, తాగటానికి మంచి నీరు లాంటి ఏర్పాటు చేస్తే బాగుంటుంది అని భక్తుల నుంచి పెద్ద ఎత్తున విజ్ఞప్తులు వస్తున్నాయి. ప్రస్తుత టీటీడీ పాలక మండలి చైర్మన్ బివి నాయుడు, మండలి సభ్యులు బీజేపీ నేత భాను ప్రకాష్ రెడ్డి, కూటమి నాయకులు ఈ పరిస్థితి పై దృష్టి సారించి భక్తుల సౌకర్యార్థం చిన్నపాటి వసతి సౌకర్యాలు ఏర్పాటు చేయాలి అని హిందూ భక్తులు సవినయంగా కోరుతున్నారు.

## సోలార్ విద్యుద్దీకరణ పనులు వేగవంతం చేయాలి

– ఎపిఎస్‌పిడిసిఎల్ సిజిఎం కృష్ణారెడ్డి

కుప్పం, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త



కుప్పం నియోజకవర్గంలో పిఎం కుసుమ్ పథకం లో భాగంగా రైతుల వ్యవసాయ కనెక్షన్ల సోలరైజేషన్ పనులు వేగవంతం చేయాలని ఎపిఎస్‌పిడిసిఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ (ఆపరేషన్స్) కృష్ణారెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక రెస్కో కార్యాలయంలో చిత్తూరు ఎస్ఇ ఇస్మాయిల్, రెస్కో ఎండి సోమశేఖర్, ఎపిఎస్‌పిడిసిఎల్, రెస్కో అధికారులతో సమీక్షాసమావేశం నిర్వహించారు. కుప్పం నియోజకవర్గంలో గుర్తించిన దాదాపు తొమ్మిదివేల ఎస్సీ, ఎస్టీకుటుంబాలకు సోలార్ విద్యుద్దీకరణ పనులు పూర్తి చేయాలన్నారు. అదేవిధంగా కుప్పం రెస్కో పరిధిలో నిర్మాణంలో ఉన్న సబ్‌స్టేషన్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ముందుందు వేసవి రానుండడంతో విద్యుత్ లోడ్ అధికంగా ఉండే అవకాశం ఉంటుందని అందుకు తగిన విధంగా సప్లై ఉండేలా చూసుకోవాలన్నారు. అనంతరం కుప్పం రెస్కో సమస్యలు,ఇతరవిద్యుత్‌సమస్యలపైచర్చించారు.కార్యక్రమంలో రెస్కో ఎడిఇలు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

## ఎర్రబ్యాడ్జీలతో ఎన్ఎంయుఎ ఉద్యోగుల ధర్నా

కుప్పం, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త



రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ (ఎన్ఎంయుఎ) ఉద్యోగులు ఎర్రబ్యాడ్జీలు ధరించి ధర్నా చేపట్టారు. డిపో వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రసాద్, డిపో కార్యదర్శి జయపాల్ మాట్లాడుతూ గవర్నర్ పేట డిపోను లులూ మాల్‌కు ధారాదత్తం చేయడాన్ని మానుకోవాలన్నారు. రాష్ట్రంలోని 129 డిపోల్లో 12 డిపోల ఆర్టీసీ స్థలాలను పినాకిల్ కంపెనీకి ఇవ్వాలనే నిర్ణయం విరమించుకోవాలన్నారు. ఎలక్ట్రిక్ బస్సులు ప్రైవేట్ ద్వారా నడపడం అనే ఆలోచన మానుకోవాలన్నారు. తక్షణమే డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లను రెగ్యులర్ ప్రాతిపదికన నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మొగిలీశ్వరన్, సుభాన్, రమణ, ఖలీల్, బాలకృష్ణ, ఎల్లుస్వామి, రామచంద్ర, నాయక్, విజయ్‌కుమార్, నారాయణ, ముస్తఫా, ఉదయ్, శ్రావణ్‌నాయక్, రాజు, నాయక్, మధు పాల్గొన్నారు.

## ప్యాలస్ సర్కిల్‌లో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు

కుప్పం, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త



సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో పట్టణంలోని ప్రధాన కూడళ్లను సుందరీకరణ చేస్తున్నారు. అందు లోభాగంగా స్థానిక 19వ వార్డు ప్యాలస్ కెజిఎన్ సర్కిల్‌లో నూతనంగా హైమాస్ట్ లైట్లను నూతనంగా ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ జిమ్‌దాము, మైనార్టీ సెల్ అధ్యక్షుడు జాకీర్, నేతలు రమేష్, చంద్రశేఖర్, జమీర్, రాధ పాల్గొన్నారు.

## ప్రభుత్వభూమి కబ్జాపై ఆర్డీఒకు ఫిర్యాదు

శాంతిపురం, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త

మండలంలోని తుమ్మిశి రెవెన్యూ పరిధి తులసినాయనపల్లి సమీపంలో ప్రభుత్వ భూమిని రామప్ప అనే వ్యక్తి కబ్జా చేసి రాతికూసాలు నాటినట్లు గ్రామస్తులు ఆర్డీఒకు ఫిర్యాదు చేశారు. కుప్పం - పలమనేరు రోడ్డు సమీపంలో తులసినాయనపల్లి వద్ద సర్వే నెం 34/6బిలో ఉన్న 47 సెంట్ల స్థలాన్ని ఆక్రమించాడన్నారు. ఈస్థలంలో నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. దీనిపై స్పందించిన ఆర్డీఒ తగు చర్యల నిమిత్తం తహశీల్దార్‌ను ఆదేశించారు.

## చుక్కల ట్రస్ట్‌చే దివ్యాంగులకు శ్రీవారి దర్శనం

కుప్పం, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త



హైదరాబాద్‌కు చెందిన చుక్కల చారిటబుల్ ట్రస్ట్ అధ్వర్యంలో కుప్పం నియోజకవర్గంలోని నలభై మంది దివ్యాంగులు తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. మంగళవారం ఉదయం టిటిడి డైరెక్టర్ వైద్య ం శాంతారాం, ట్రస్ట్ వ్యవస్థాపకులు డా॥ వేణు చుక్కల దివ్యాంగులకు శ్రీవెంకటే శ్వరస్వామి దర్శనాన్ని దివ్యాంగులకు కల్పించారు. ఈసంద ర్భంగా డా॥ వేణు చుక్కల మాట్లాడుతూ 13వ దివా ్యంగుల దర్శన కార్యక్రమం పూర్తయిందన్నారు. ఇప్పటిదాకా శ్రీవారిని దర్శించుకున్న భక్తుల సంఖ్య 2969కు చేరిందన్నారు. ఈసందర్భంగా ఆయన సిఎం చంద్రబాబునాయుడు, డిసిఎం పవన్ కళ్యాణ్, మంత్రులు నారా లోకేష్, ఆనం రామనారా య ణరెడ్డి, టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు, ప్రభుత వ్విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్‌చైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ డా॥ బిఆర్ సురేష్‌బాబు, టిటిడి డైరెక్టర్ వైద్యం శాంతారాంలకు కృతజ్ఞతలు తెలిపారు. టిటిడి సభ్యుడు వైద్యం శాంతారాం భక్తులకు శ్రీవారి దర్శనం, గదుల ఏర్పాటు, ప్రసాదంపంపిణీ తదితర సౌకర్యాల కల్పనలో అందించిన సహకారం అభినందనీయమన్నారు.

## గురుకులంనుంచి వెళ్లిన విద్యార్థులు..కుటుంబీకులకు అప్పగింత

కుప్పం, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త



మహాత్మాజ్యోతిబా పూలే బిసి రెసిడెన్షియల్ స్కూల్‌లో చదువుతున్న ఇద్దరు విద్యార్థులు స్కూల్ నుంచి వెళ్లిపోగా పోలీసు అధికారులు, సిబ్బంది వారి ఆచూకీ కనుగొని ఆరుగంటల్లో వారి కుటుంబీకులకు అప్పగించిన సంఘటన ఇది. కుప్పం రూరల్ సిఐ మల్లేష్ యాదవ్ తెలిపిన మేరకు వివరాలిలా.. మాదనపల్లికి చెందిన లోహిత్‌కుమార్ (14) రెసిడెన్షియల్ స్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. అలాగే నితిన్ (12) ఆరోతరగతి చదువుతున్నాడన్నారు. వీరు మంగళవారం ఉదయం పది గంటలకు స్కూల్ నుంచి వెళ్లిపోయారని హెచ్ఎం గుడుపల్లె పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కుప్పం డిఎస్పీ పార్థసారథి ఆదేశాలతో తనతో పాటు రాళ్లబూదుగూరు ఎస్సై నరేష్, సిబ్బంది కలిసి బృందాలుగా విడిపోయి విద్యార్థుల కోసం గాలించగా ఆరు గంటల్లోపే వారి ఆచూకీ కనుగొని స్కూల్‌లో కుటుంబీకులకు అప్పగించినట్లు సిఐ తెలిపారు.

## మన టిడిపి యాప్ గురించి విస్తృత ప్రచారం.



చిట్వేలి, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త :

పార్టీ ఆదేశానుసారం మన టిడిపి యాప్ గురించి మండల టిడిపి బాధ్యుడు కాకర్ల నాగా ర్జున ఆధ్వర్యంలో మంగళవారం తిమ్మయ్య గారి పల్లి ఎంపీటీసీ పరిధిలో విస్తృత ప్రచారం నిర్వ హించారు. కార్యక్రమానికి టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కస్తూరి విశ్వనాథ నాయుడు, సాంస్క ృతిక విభాగం అధ్యక్షులు పంతగాని నరసింహ ప్రసాద్,ప్రముఖ పారిశ్రామికవేత్త విశ్వేశ్వర నాయుడు ముఖ్యులుగా హాజరయ్యారు. ప్రతి ఇంటికి వెళ్లి యాప్ ప్రాముఖ్యతను వివరించారు. వారు మాట్లాడుతూ సామాన్య కార్యకర్తను, ముఖ్యమంత్రితో,నాయకులతో అనుసంధానం చేసే వేదికగా మన టిడిపి యాప్ ముఖ్య ఉద్దేశం అన్నారు. ప్లే స్టోర్ నందు డౌన్లోడ్ చేసుకుని, మొబైల్ నెంబర్కు వచ్చే ఓటిపితో ఈ యాప్ పొందవచ్చన్నారు. సభ్యత్వ నమోదు, ప్రమాద భీమా,ఎగ్జిట్ పోల్స్ ద్వారా తమ అభిప్రాయాలను వెల్లడించడం, తమ పరిసర ప్రాంతాలలోని ప్రభుత్వం నిర్వహిస్తున్న అభివృద్ధి పనులు తెలుసుకోవడం ఈ యాప్ తో సాధ్యమన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు కాకర్ల నాగార్జున మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మై టిడిపి యాప్ను తమ మొబైల్ నందు పొంది, ప్రభుత్వం అందిస్తున్న సమగ్ర సమాచారాన్ని తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి గడపకు చేర్చేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి అనంతయ్య యాదవ్, క్లస్టర్ ఇంచార్జ్ లు బుంగటావుల రాజశేఖర్, వెంకటేష్ రాజు, కో. క్లస్టర్ కట్టా గిరి బాబు, గ్రామ కమిటీ అధ్యక్షులు సింగన హరి, పగడాల వెంకటేష్,మాచినేని సుబ్బారామయ్య, మురగాని బాబు, రామచంద్ర యాదవ్, మించల బాలకృష్ణ, విద్యా కమిటీ చైర్మన్ శంకర్ రాజు,నక్కల పల్లి సర్పెంచ్ మద్దిన చంద్ర మోహన్, రాటకొండ వెంకటయ్య, బూత్ ఇంచార్జ్ రామిశెట్టి నరసింహులు, మాదినేని విశ్వనాథం,నానబాల రమేష్ బాబు, సీనియర్ నాయకులు లారీ సుబ్బారాయుడు, బాలు రామాంజనేయులు, కాటూరు నరసింహులు, దళిత నాయకులు అద్భుత కుమార్, టీడీపీ అభిమానులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గున్నారు.

## నేడు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి కళ్యాణోత్సవం

– కళ్యాణోత్సవంలో పాల్గొననున్న నియోజకవర్గ ఇన్చార్జి చల్లా రామచంద్రరెడ్డి

పులిచర్ల, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త



మండలంలోని మంగళంపేటలో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణోత్సవం ఈ నెల 25వ తేది బుధవారం సాయంత్రం 4 గంటలకు జరగనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. స్వామి అమ్మవార్ల కళ్యాణోత్సవానికి పులిచర్ల నియోజకవర్గ ఇన్చార్జి చల్లా రామచంద్ర రెడ్డి సతీ సమేతంగా శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పించడానికి ఈ నెల 25వ తేది బుధవారం సాయంత్రం నాలుగు గంటలకు మంగళంపేటలో వెలిసి ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శిస్తారు. అందువల్ల కూటమి నాయకులు, కార్యకర్తలు స్వామి వారి భక్తులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందిగా ఆలయ కమిటీ కోరారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## సత్వరం అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలకు పరిష్కారం

– రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షులు రామానాయుడు

చిత్తూరుహెల్త్, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:



అంగన్‌వాడీ వర్కర్ల న్యాయపరమైన సమస్యలను పరిష్కరించకుంటే గత ఉద్యమ పోరాట అనుభవాలను చవిచూడాల్సి వస్తోందని రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షులు రామానాయుడు హెచ్చరిం చారు. రాష్ట్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల సమస్యల పరిష్కారం కోసం రెండు రోజులుగా ఐసిడిఎస్ కార్యాలయ ఆవరణలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలను ఉద్దేశించి రామానాయుడు మాట్లాడుతూ గత రెండు రోజులుగా దీక్షలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల సమస్యలను పట్టించుకోలేదని ధ్వజమెత్తారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలకు జీతాలు పెంచుకుంటున్నారని, అయితే ప్రజలకు ప్రజలకు మధ్య వారధిగా వుండి సేవ చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలకు వేతనాలు పెంచడంలో, రాయితీలు ఇవ్వడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్ల సమస్యలను పరిశీలించి పరిష్కరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎఐటియుసి గౌరవ అధ్యక్షులు ఎస్.నాగరాజు, ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి కె.శివారెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్తల సంఘ నాయకులు ప్రభావతి, సుజిని, అరుణ, విజయ, ఫరీదా, పుష్ప, అముద, కన్యాకుమారి, భాగ్య, బిందుపాల్గొన్నారు.

## పోలీసులను సన్మానించిన ఎమ్మార్పీఎస్ నాయకులు

చౌడేపల్లి, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త



నూతనంగా బాధ్యతలు చేపట్టిన పుంగనూరు రూరల (చౌడేపల్లి)సిఐ సాయిప్రసాద్, ఎస్ఐ చిన్నరెడ్డెప్పలను ఎమ్మార్పీఎస్, ఎండిపిఎస్ నాయకులు సన్మానించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఇరువురినీ దుశ్శాలువాలతో సన్మానించి, పుష్పగుచ్ఛాలందించారు. మాదిగ దళపోరాట సమితి పుంగనూరు, చౌడేపల్లి నాయకులు వెంకట్రమణ, బాజిగం హరిబాబు, ఆంజప్ప, హరిబాబు, లోకేష్, గంగులప్ప, ఎమ్మార్పీఎస్ నాయకులు గోవిందు, మల్లికార్జున, రెడ్డెప్ప, సుబ్రమణ్యం, రంజిత్, నాగరాజ, శ్రీనివాసులు, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్లపైకి దుకాణాలు ఇబ్బందుల్లో వాహనదారులు

చౌడేపల్లి, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త



ఇంకొంచె ముందుకు వెళ్ళు అన్నట్లుగా దుకాణదారులు రోజురోజుకూ రోడ్లపైకి దుకాణాలు పెట్టుకోవడంతో వాహనదారులు, ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శక్తిక్షేత్రం బోయకొండ, విజయవాడ, చెన్నై వంటి నగరాలకు ప్రధాన కూడలిగా వుండే చౌడేపల్లి బస్టాండులో ట్రాఫిక్ సమస్యతో సతమతమవుతున్నారు. అసలే ఇరుకిరుకు రోడ్లు ఆపై దుకాణదారులు ఆక్రమణలతో ట్రాఫిక్ సమస్య మరింతగా పెరిగిపోయింది. ఇటీవల బస్టాండులో ఆక్రమణలు తొలగించి పంచాయతీకి సంబంధించిన కాలువలు వేసారు. అయితే మరలా అదే కాలువలను ఆక్రమించి యధావిధిగా దుకాణాలు నడుపుకొంటున్నారు. ఇదిలా వుంటే రోడ్డుకిరువైపులా వున్న పెద్ద పెద్ద దుకాణదారులు ఎదురుగా వున్న రోడ్డుపై తోపుడు బండ్లను పెట్టుకోమని వారినుంచి రోజువారి అద్దెను వసూలు చేస్తున్నారు. రోడ్లపై బండ్లకు అద్దెవెల్లిస్తూ ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం వాటిళ్ళేలా చేస్తున్నారు. నిత్యం ప్రయాణీకులతో రద్దీగా వుంటే బస్టాండులో దుకాణదారులు రోడ్లపైకి రావడంతో ఆర్టీసీ బస్సులు నడిరోడ్డుపైనే నిలపాల్సి వస్తోంది. ప్రయాణీకులకు నిల్చొనే అవకాశం లేకుండా దురాక్రమణలు పెరిగేపోతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి చౌడేపల్లి బస్టాండులో దురాక్రమణలు తొలగించి ట్రాఫిక్‌ను నియంత్రించడం, ప్రయాణీలకు వసతులు కల్పించాలని వారు కోరుతున్నారు.

## సెలవు పెట్టకుండా మూకుమ్మడిగా బోయకొండకు..

పులిచర్ల, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త



అమ్మ గంగమ్మ తల్లి.. కష్టాలు ఎక్కువైపోయాయి.. మమ్మల్ని కాపాడు అంటూ. ముకుమ్మడిగా ఉపాధి సిబ్బంది మంగళవారం బోయకొండ గంగమ్మ ఆలయ దర్శనానికి వెళ్లారు. వివరాల్లోకి వెళితే..చిత్తూరు జిల్లా పులిచెర్ల మండల ఉపాధి హామీ పథకం కార్యాలయం మంగళవారం మూతపడింది. సాధారణంగా సెలవు రోజుల్లోనే ప్రభుత్వ కార్యాలయం మూతపడతాయి. అయితే ఉపాధి సిబ్బంది ఎటువంటి సెలవు లేకుండా అందరూ బోయకొండకు వెళ్లడంతో కార్యాలయం మూతపడింది. వివిధ పనుల కోసం ఉపాధి ఆఫీసుకు వచ్చిన గ్రామస్తులకు కార్యాలయంలో ఎవరూ లేకపోవడంతో. ఈరోజు ఏమి సెలవు కాదే అంటూ నిరాశతో వెళ్లారు. కార్యాలయంలో ఉపాధి సిబ్బంది లేని విషయాన్ని ఎంపీడీవో రాజశేఖర్ బాబు ను వివరణ కోరగా మంగళవారం ఎవరు సెలవు పెట్టలేదని తెలిపారు.

## పాత కలెక్టరేట్‌ను పరిశీలించిన చేసిన కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:



గిరింపేటలోని పాత కలెక్టరేట్‌ను మంగళవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ పరిశీలించారు. జిల్లాలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా కేసుల్లో పట్టుబడిన మాదకద్రవ్యాలను సురక్షితంగా భద్రపరచడానికి అనువైన ప్రదేశంగా పాత కలెక్టరేట్‌ను నిర్ణయించి ఆ మేరకు కలెక్టర్ ఇక్కడ వున్న భవనాలను పరిశీలించారు. పాత కలెక్టరేట్‌లోని టౌన్ ప్లానింగ్ విభాగంలోని హాలును పరిశీలించిన కలెక్టర్ ఈ ప్రదేశంలో పట్టుబడిన మాదకద్రవ్యాలను భద్రపరచడం సురక్షితమని నిర్ణయించారు. ఈ మేరకు టౌన్ ప్లానింగ్ విభాగంలోని హాలులో అవసరమైన మరమ్మత్తులు, భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు. మాదకద్రవ్యాల భద్రపరిచే ప్రక్రియలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని, భవనం పూర్తి స్థాయి వినియోగంకు అనుకూలంగా వుండేలా త్వరితంగా మరమ్మత్తులు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ మోహన్‌కుమార్‌తో పాటు ఆర్అండ్‌బి ఇఇ శ్రీనివాసులు, అర్బన్ తహసిల్దారు కులశేఖర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి అక్రిడేషన్ కార్డులు

– కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:

అర్హులైన ప్రతి ఒక్కరికి అక్రిడేషన్ కార్డులు మంజూరు చేస్తామని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో మంగళవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ అధ్యక్షతన డిఎంఎసి 2వ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హత కలిగి వున్న ప్రతి ఒక్క ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు అక్రిడేషన్ కార్డులు మంజూరు చేస్తామన్నారు. ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా వున్న జర్నలిస్టులకు తగిన సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ సమావేశంలో కేబుల్ టీవీలు, చిన్నపత్రికలు, వారపత్రికలకు అక్రిడేషన్ ఆమోదించడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో డిఎంఎసి కమిటీ కన్వీనర్ ఎస్.వేలాయుధం, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## మెడికల్ మాఫియాకు అడ్డుకట్ట వేయకుంటే పోరాటం

– ఈ నెల 28న డిఎంహెచ్ఓ కార్యాలయం ఎదుట సిపిఐ ఆధ్వర్యంలో నిరసన

– రాష్ట్ర సిపిఐ కార్యవర్గ సభ్యులు రామానాయుడు

చిత్తూరుహెల్త్, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:



రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న మెడికల్ మాఫియాకు అడ్డుకట్ట వేయడానికి చర్యలు చేపట్టకుంటే ఈ నెల 28వ తేదీన కలెక్టరేట్ ఎదుట సిపిఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహిస్తామని రాష్ట్ర సిపిఐ కార్యవర్గ సభ్యులు రామానాయుడు అన్నారు. జిల్లా సిపిఐ కార్యాలయం కార్యాలయంలో మంగళవారం జరిగిన సిపిఐ నాయకుల సమావేశంలో రామానాయుడు మాట్లాడుతూ నకిలీ మందులు, కాలం చెల్లిన మందులను అరికట్టడంలో ప్రభుత్వం, సంబంధిత అధికారులు విఫలం చెందారని, అలాగే నిబంధనలకు వ్యతిరేకంగా నడుస్తున్న మెడికల్ షాపులపై చర్యలు తీసుకోవడంపై డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ జిల్లా అధికారి పూర్తిగా విఫలం అయ్యారని ఆరోపించారు. జిల్లాలో లెక్కకు మించిన మెడికల్ షాపులు వున్నాయని, ఈ షాపులు నిబంధనలకు అనుగుణంగా వున్నాయా! అనేది చూడాల్సిన జిల్లా డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారి ఎందుకు ఈ పని చూడటం లేదనే విషయంను చెప్పాలని డిమాండ్ చేశారు. జిల్లా సిపిఐ కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ బిఫార్మసీ, ఫార్మాడి చదివిన వారి నుండి సర్టిఫికేట్లు తీసుకుని అర్హత లేని వారు రాజకీయ అండ, ధన బలంతో మెడికల్ షాపులు నడుపుతున్నారని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా మెడికల్ మాఫియాకు అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఆధ్వర్యంలో ఈ నెల 28న నిర్వహించనున్న నిరసన కార్యక్రమంను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలలో సిపిఐ నాయకులు గోపినాథ్, విజయగౌరి, జమిలాబీ, కుమారి, ఎం.విజయకుమార్, పి.రఘు, బి.మునస్వామి, చాందిని, మహబూబ్‌భాషా తదితరులు పాల్గొన్నారు.

# రైల్వే కోడూరు డివిజన్

## బీసీలకు 34 శాతం రిజర్వేషన్ పట్ల హర్షం

బత్తిన గంగయ్య యాదవ్

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం బీసీలకు 34 శాతం రిజర్వేషన్ ఇవ్వడం పట్ల రైల్వే కోడూరు జనసేన నాయకులు బత్తిన గంగయ్య యాదవ్ హర్షం వ్యక్తం చేశారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైఎస్ఆర్సిపి ప్రభుత్వం స్థానిక సంస్థలలో 34 శాతం నుండి 24 శాతంకు తగ్గించి బీసీలకు తీరని అన్యాయం చేసిందని గంగయ్య మండిపడ్డాడు. అందుకే 2024 ఎన్నికలలో కేవలం 11 సీట్లకే వైసిపి కుప్పకూలిపోయిందని ఆయన అన్నారు. రాష్ట్రంలో 50 శాతం జనాభా ఉన్న బీసీలకు అన్యాయం చేస్తే వారికి పతనం తప్పదని గంగయ్య తీవ్రంగా ఆరోపించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక స్థానిక సంస్థలలో బీసీలకు 24 నుండి 34 శాతం రిజర్వేషన్ చేయాలని ప్రతిపాదించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు ప్రత్యేక ధన్యవాదాలను గంగయ్య తెలియజేశారు. బీసీలకు న్యాయం చేయాలంటే ఒక కూటమి ప్రభుత్వానికి సాధ్యమవుతుందని ఆయన విలేకరులకు వివరించారు.

## విద్యార్థులపై దాడి చేసిన కరస్పాండెంట్‌పై అధికారుల విచారణ..

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త



రైల్వేకోడూరు పట్టణంలోని హెచ్ఎంఎం హైస్కూల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులపై కరస్పాండెంట్ దాడి చేసిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ వి.చందన మంగళవారం స్థానిక పాఠశాలలోని విద్యార్థులను, విద్యార్థుల తల్లిదండ్రులను విచారణ చేపట్టారు. జరిగిన సంభాషణను, ఘర్షణను పూర్తిగా బాధితులు ఏఎస్‌డబ్ల్యూఓకు పూర్తిగా వివరించారు. ముఖ్యంగా పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులను కరస్పాండెంట్ ఇంటికి తీసుకువెళ్లి వారిపై విచక్షణారహితంగా కొట్టడం పట్ల విద్యార్థికి మూర్ఛ రావడంతో ఆసుపత్రికి తరలించి వెంటనే గాయపడ్డ విద్యార్థిని ఎవరికి తెలియకుండా ఇంటికి పంపించడం అక్కడ విద్యార్థుల తల్లిదండ్రులు ఆరా తీయగా పూర్తి సమాచారాన్ని విచారణకు వచ్చిన అధికారికి వివరించారు. అదేవిధంగా ఏ ఎస్ డబ్ల్యూ ఓ సంబంధిత కరస్పాండెంట్ను పాఠశాలకు రమ్మని ఫోన్ చేయగా రింగ్ అయినా ఎత్తకపోవడం కొద్దిసేపటికి కరస్పాండెంట్ ఫోన్ స్విచ్ ఆఫ్ చేయడం జరిగిందని అధికారిని విలేకరులకు వివరించారు. సంబంధిత నివేదికలను పూర్తిగా జిల్లా ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు చందన వివరించారు. ఈ విచారణలో పాఠశాల హెడ్మాస్టర్ ప్రసాద్, అటెండర్ విజయకుమార్, కిరణ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పోక్స్ చట్టంపై అవగాహన



వాకాడు, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త: వాకాడులోని గవర్నమెంట్ ఐటిఐ కాలేజీలోని మంగళవారం చదువుకుంటున్న విద్యార్థుల సమావేశంలో సబ్ ఇన్స్పెక్టర్ నిఖిల్ బాబు మాట్లాడుతూ ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రమ్ సెక్సువల్ అఫెన్సెస్ (పోక్స్) చట్టంతో పాటు అదే విధంగా గంజాయి, డ్రగ్స్ పై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించారు. బయట వ్యక్తులు గంజెయి డ్రగ్స్‌లను ప్రేరేపించిన, గంజాయి అమ్ముతున్న వ్యక్తులను వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సబ్ ఇన్స్పెక్టర్ నిఖిల్ సూచించారు. ముఖ్యంగా మైనర్ డ్రైవింగ్ చట్ట విరుద్ధమన్నారు. ఈ కార్యక్రమంలో ఐటిఐ సిబ్బంది, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## నేరాలు, అపరిచితులపై అవగాహన సీఐ



వాకాడు, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త: రాత్రి వేళలో గుర్తు తెలియని వ్యక్తులు తలుపులు తడితే వెంటనే పోలీసులకు కాల్ కాల్ చేసి వెంటనే సమాచారం అందజేయాలని వాకాడు సర్కిల్ ఇన్స్పెక్టర్ హుస్సేన్ భాష తెలిపారు. మంగళవారం వాకాడు పంచాయతీ పరిధిలోని బీసీ కాలనీ గ్రామస్తులతో ముఖాముఖిగా మాట్లాడారు. సిఐ మాట్లాడుతూ క్రైమ్ నేరాలపై గ్రామస్తులకు సీఐ అవగాహన కల్పించారు. గ్రామంలో ఉన్నటువంటి ఇరుగు పొరుగు వారు అర్ధరాత్రి వేళలో గుర్తు తెలియను వ్యక్తులు వచ్చిన వెంటనే పోలీసులకు కాల్ చేయాలని సూచించారు. సీఐ వెంట సబ్ ఇన్స్పెక్టర్ నిఖిల్ బాబు, సిబ్బంది రమణ, మస్తాన్, హరిబాబు తదితరులు ఉన్నారు.

# సూళ్ళూరుపేట డివిజన్

## నాయకుడికి అండగా నిలబడదాం ఉయ్యాల



నాయుడుపేట, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త: ఈనెల 26వ తేదీ నుండి జనసేన ఉద్యమి సభ్యత్వం కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించాలని జనసేన పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి వర్యులు పవన్ కళ్యాణ్ జనసేన శ్రేణులని ఆదేశించారు. అందులో భాగంగా మంగళవారం ఉమ్మడి నెల్లూరు జిల్లాకి చెందిన తిరుపతి పార్లమెంట్ పరిధిలోని సూళ్లూరుపేట, సర్వేపల్లి, గూడూరు నియోజకవర్గాల జనసేన నాయకులు నాయుడుపేటలోని సూళ్లూరుపేట నియోజకవర్గం జనసేన పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. తిరుపతి పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాలకి తిరుపతి శాసనసభ్యులు ఆరాణి శ్రీనివాసులు ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి పరిశీలకులుగా అధ్యక్షులు పవన్ కళ్యాణ్ నియమించడం జరిగిందని తెలియజేశారు. త్వరలో ఆరాణి శ్రీనివాసులు కూడా అన్ని నియోజకవర్గాలు పర్యాటస్తారని అయన ఈ సందర్భంగా వారు అన్నారు. ఈ కార్యక్రమంలో సర్వేపల్లి నియోజకవర్గం పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ బొబ్బేపల్లి సురేష్ నాయుడు, గూడూరు నియోజకవర్గం నుండి ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షులు రాష్ట్ర లీగల్ సెల్ సెక్రెటరీ తీగల చంద్రశేఖర రావు, గూడూరు నియోజకవర్గం పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ మోహన్, జనసేన పార్టీ సీనియర్ నాయకులు అట్ల కృష్ణారావు, నాయుడుపేట ఏఎంసీ డైరెక్టర్ గిండి సతీష్, నాయుడుపేట శ్రీ పోలేరమ్మ దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ మెంబర్ బాలు శెట్టి, జ్యోతిష్ మరియు మూడు నియోజకవర్గాల జనసేన నాయకులు జనసైనికులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కార్యకర్తల ధర్నా



సూళ్లూరుపేట, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త: సూళ్లూరుపేట, తడ, దొరవారిసత్రం మండలాలకు సంబంధించి అంగన్‌వాడీ ప్రాజెక్టులో పని చేస్తున్న కార్యకర్తలు మంగళవారం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2026 మే నెల మొత్తం సెలవులుగా ప్రకటిస్తూ జీవో జారీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తల అధ్యక్షురాలు హైమావతి, సిఐటియు నాయకులు లక్ష్మయ్య, సుబ్రహ్మణ్యం, వెంకటరమణ పాల్గొన్నారు.

## ఇంటర్ పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు



సూళ్లూరుపేట, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త: ఇంటర్మీడియట్ పరీక్ష జరుగుతున్న మూడు కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సిఐ మురళీకృష్ణ తెలిపారు. మంగళవారం ఆయన పరీక్షలు జరుగుతున్న కేంద్రాల వద్ద బందోబస్తును పరిశీలించారు. పరీక్షల సమయంలో ఎటువంటి ట్రాఫిక్ అంతరాయం కలగకుండా పట్టణంలో పరీక్షా కేంద్రాలకు వచ్చే మార్గాల్లో ముందస్తుగా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి ఘటనలు జరిగినా తక్షణమే డయల్ 100కు గాని, సూళ్లూరుపేట సిఐ, ఎస్ఐ నంబర్లకు ఫోన్ చేయాలని సీఐ మురళీకృష్ణ కోరారు.

## అంగన్వాడీలు రిలే నిరాహార దీక్షలు



నాయుడుపేట, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త: ఏ పార్టీ అధికారంలోకి వచ్చిన ఎన్నాళ్ళ నుంచో అరాకొర జీతాలతో పిల్లల కోసం గర్భిణీ స్త్రీల కోసం కష్టపడుతున్న అంగన్వాడీలకు న్యాయం జరగటం లేదని అంగన్వాడీ ప్రాజెక్ట్ కార్యదర్శి శ్యామలమ్మ అన్నారు. నాయుడుపేట ఐసిడిఎస్ కార్యాలయం వద్ద నాయుడుపేట, ఓజిలి, పెళ్ళకూరు మండలాల అంగన్వాడీలు తమ న్యాయమైన కోర్కెలు తీర్చాలంటూ సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో అంగనవాడి ప్రాజెక్టు అధ్యక్షులు, విజయ, నాగమ్మ, వాణి, రమణమ్మ, పుష్ప, జమీల, ఆదెమ్మ, బంగారమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ జెఏసి ఎన్నికలకు ఎంపికైన అధికారులు



నాయుడుపేట, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ అమరావతి రెవిన్యూ ఎంప్లాయిస్ జేఏసి ఇచ్చిన మండల ఎన్నిక నోటిఫికేషన్‌లో భాగంగా మంగళవారం తిరుపతి జిల్లా సూళ్లూరుపేట డివిజన్, నాయుడుపేట మండల జేఏసి ఎన్నికకు గ్రామ రెవిన్యూ అధికారులు సంఘం రాష్ట్ర కార్య వర్గ సభ్యులు చిట్టేటి మనోజ్ కుమార్, గూడూరు మండల అధ్యక్షుడు గిద్దలూరు రమణయ్య ఆధ్వర్యంలో భూదనం రమేష్, ఎన్నికల అధికారిగా కె.చంద్ర శేఖర్, ఎన్నికల సహాయ అధికారిగా నాయుడుపేట మండల జేఏసి ఎన్నిక నిర్వహించారు. సదరు ఎన్నికలో 12 మంది సభ్యులను తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది గ్రామ రెవిన్యూ అధికారులు,గ్రామ సర్వేయర్లు మరియు గ్రామ రెవిన్యూ సహాయకులు పాల్గొని ఏకగ్రీవముగా ఎన్నుకోవడం జరిగింది.

## కొనసాగింపుకు ప్రయత్నిస్తుంటే...బదిలీనా!



శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 24 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయ ఇఓ డి.బాపిరెడ్డిని స్వంత శాఖకు బదిలీ చేసారు. ఆయన స్థానంలో ముద్దనూరు జిజిఎస్‌లో పని చేస్తున్న బికె వెంకటేశ్వర్లును నియమిస్తూ ప్రభుత్వం జిఓ ఎంఎస్ నెంబర్ 471 తేది 24.02.2026 జారి చేసారు. రాష్ట్రంలోని పలువురు రెవెన్యూ ఉద్యోగులను బదిలి చేస్తూ ఇతర చోట్లకు పోస్టింగ్ ఇచ్చారు. శ్రీకాళహస్తీశ్వరాలయ ఇఓగా టి.బాపిరెడ్డి 2024 నవంబర్ మాసంలో ఇక్కడకు వచ్చారు. ఆయన వచ్చిన తరువాత మొదటి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆ ఏడాది ధర్మకర్తల మండలి లేదు. దాంతో శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి ఆదేశాలతో ప్రణాళికలతో అద్భుతంగా నిర్వహించారు. ఈ ఏడాది శివరాత్రిలో గత ఏడాది లోటు పాట్లను గుర్తించి మార్పులు చేర్పులతో శివరాత్రిని నిర్వహించారు. ఈ ఏడాది శివరాత్రి బ్రహ్మోత్సవాలను ప్రజలు మెచ్చేరీతిలో నిర్వహించారు.అంతేకాక శివరాత్రిలో దేవాదాయశాఖ మంత్రి ఆనం నారాయణరెడ్డి సూచనలతో కలెక్టర్, ఎస్పి ఆదేశాలతో ఎక్కడా ఇబ్బంది లేకుండా ఉత్సవాలను నిర్వహించారు.

**అభివృద్ధిలో పరుగులు:**

శ్రీకాళహస్తీశ్వరాలయ కార్యనిర్వహణాధికారిగా సుమారు 15 నెలలుపని చేసిన బాపిరెడ్డి హయాంలో గతంలో ఏ ఇఓ హయాంలో జరగని అభివృద్ది జరిగింది. ముఖ్యంగా శివం టు శివం రోడ్డు పనులను రూ.27కోట్లతో చేపట్టారు.ఈ రోడ్డును మంత్రిచే ప్రారంభింపజేసారు. గత ప్రభుత్వం రూ.46కోట్లకు ప్రతిపాదనలు రూపొందిస్తే బాపిరెడ్డిహయాంలో రూ.27 కోట్లకే పనులు చేయించారు. కాగా గిరిప్రదక్షిణలో గత ప్రభుత్వం సగం సిమెంటు రోడ్డును రూ.18కోట్లకు చేస్తే మిగిలిన సగం రోడ్డును బాపిరెడ్డి హాయంలో రూ.7కోట్లకే పూర్తి చేసారు. ఇక ఆలయంలో ఎన్నో సంస్కరణలు అమలు చేసారు. ముఖ్యంగా టిక్కెట్టు కౌంటర్లు బయట ఒకేచోట ఏర్పాటు చేయటంలో బాపిరెడ్డి ఎంతో చొరవ చూపారు. అలాగే ఆలయ దర్శన వేళలను భక్తుల మనోభావాలకు అనుకూలంగా రూపకల్పన చేసారు. ఇక గతంలో మ్యానువల్‌గా ఉన్న టిక్కెట్లును ఆన్‌లైన్ చేయించారు. ఇక ఆయన బాధ్యతలు స్వీకరించిన తరువాత సన్నధివీధి రోడ్డు,పానగల్‌లో రోడ్లకు మహర్దశ కల్పించారు.స్వర్ణముఖి ప్రక్షాళనకు పూనుకున్నారు. శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి ప్రభుత్వానికి మరో రెండు సంవత్సరాలు అవకాశం కల్పించమని కోరనున్నట్లు తెలిసింది. అయితే హఠాత్తుగా మంగళవారం బదలి ఉత్తర్వులు అందటంతో పార్టీ వర్గాలు విస్తుపోయారు. అయితే ఆయన బదిలి జరుగుతుందా? లేదా? అనేది వేచి చూడాలి!

## గంజాయి ముఠా గుట్టు రట్టు



వరదయ్యపాలెం, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త: మండలంలోని అవంతి కాలనీ సమీపంలో అడవి ప్రాంతంలో గంజాయి ముఠా అక్రమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని సమాచారం అందుకున్న వరదయ్యపాలెం ఎస్సై మల్లికార్జున్ తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహిస్తుండగా కొంత మంది పరారీ అవగా ఏడు మంది మంగళవారం ఉదయం పట్టుబడినట్లు ఎస్ఐ మల్లికార్జున తెలిపారు.ఎస్సై మల్లికార్జున విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడుతూ అవంతి కాలనీ వద్ద పట్టుపడ్డ ఏడు మంది వద్ద నాలుగు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నామని అదే విధంగా నాలుగు సెల్ ఫోన్లు రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నామని 7 మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్‌లు కిరణ్, హరి, సుబ్బు పాల్గొన్నారు.

## ప్రారంభమైన ఇంటర్ సెకండ్ ఇయర్ పరీక్షలు

**-84 పరీక్షా కేంద్రాలలో ప్రశాంతంగా సెకండ్ లాంగ్వేజ్ పేపర్2 పరీక్ష -నేడు ఫస్ట్ ఇయర్ ఇంగ్లీష్ పేపర్1 పరీక్ష**

తిరుపతి విద్య,ఫిబ్రవరి 24 ప్రభాతవార్త : జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ సెకండ్ ఇయర్ పబ్లిక్ పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. జిల్లాలో ఏర్పాటు చేసిన 84 పరీక్షా కేంద్రాలలో విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేపట్టారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు జరిగిన సెకండ్ లాంగ్వేజ్ పేపర్2 పరీక్షకు 29,602మంది హాజరుకావాల్సి ఉండగా, 29,152 మంది పరీక్షకు హాజరయ్యారు, కాగా 450మంది పరీక్షకు గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. జిల్లాలోని అన్ని పరీక్షా కేంద్రాలలో సీసీ కెమెరా నిఘా నీడలో,అధికారుల ఆకస్మిక తనిఖీల మధ్య ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు ఆర్ఓ జి .రాజశేఖర్‌రెడ్డి వెల్లడించారు.

**పరీక్షా కేంద్రాల వద్ద తల్లిదండ్రుల సందడి:**

ఇంటర్ సెకండ్ ఇయర్ పరీక్షలు ప్రారంభమైన నేపథ్యంలో తొలిరోజు మంగళవారం పరీక్షా కేంద్రాల వద్దకు విద్యార్థులను తీసుకొచ్చిన తల్లిదండ్రులతో ఆ ప్రాంతం సందడిగా మారింది. విద్యార్థులకు పరీక్ష రాసేసమయంలో తీసుకోవాలసిన జాగ్రత్తలు, మెలుకువులను చెబుతూ బెస్ట్ ఆఫ్ లక్ అంటూ ధైర్యం నూరిపోశారు. అనంతరం 3 గంటల పాటు పరీక్షా కేంద్రాల వద్ద ఎండను సైతం లెక్కచేయకుండా పడిగాపులు కాస్తూ చెట్ల కిందనే నిరీక్షి ంచారు. అనారోగ్యంతో బాధపడుతున్న విద్యార్థులను పరీక్షా కేంద్రాలోకి తీసుకెళ్లేందుకు వీల్చైర్లను అధికారులు ఏర్పాటు చేశారు. నిమిషాల వ్యవధితో ఆలస్యంగా పరీక్షా కేంద్రాలకు చేరుకున్న విద్యార్థులను అధికారులు అనుమతితో సెక్యూరిటీ సిబ్బంది అనుమతించడంపై తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

**నేడు ఫస్ట్ ఇయర్ ఇంగ్లీష్ పేపర్1 పరీక్ష.**

ఇంటర్ పబ్లిక్ పరీక్షలలో భాగంగా బుధవారం ఇంటర్ ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు ఇంగ్లీష్ పేపర్1 పరీక్ష జరగనుంది. జిల్లాలో 84 పరీక్షా కేంద్రాలలో సుమారు 30వేల మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరుకానున్నారు. మాస్ కాపీయింగ్, మాల్ ప్రాక్టీస్కు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని, ప్రతి పరీక్ష కేంద్రాన్ని సిట్టింగ్, ఫ్లైయింగ్ స్క్వాడ్లతో పాటు సీసీకెమెరాలతో లైవ్ స్ట్రీమ్ ద్వారా పర్యవేక్షి ంచేందుకు ఏర్పాటు చేశామని అధికారులు వెల్లడించారు.

## నాయుడుపేటలో రాజ్యమేలుతున్న మద్యం సిండికేట్

**- రాత్రి, పగలు తేడా లేకుండా విచ్చలవిడి అమ్మకాలు**

**- తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్న అధికారులు**



నాయుడుపేట, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త: నాయుడుపేట పట్టణం, పరిసర ప్రాంతాల్లో మద్యం వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. నిబంధనలను తుంగలో తొక్కి, ఎక్సైజ్ అధికారుల అండదండలతో మద్యం లైసెన్స్‌దారులు ఒక సిండికేట్‌గా ఏర్పడి విచ్చలవిడిగా విక్రయాలు. జరుపుతున్నారు. సామాన్య ప్రజలు ఈ అక్రమ దందాతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నా, పట్టించుకో వాల్సిన అధికారులు మాత్రం మామూళ్ల మత్తులో మునిగిపోయారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్ణీత సమయాల్లోనే మద్యం విక్రయాలు జరపాలి. కానీ, నాయుడుపేటలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. పగలు, రాత్రి అనే తేడా లేకుండా 24 గంటల పాటు మద్యం అందుబాటులో ఉంచుతున్నారు. ప్రధాన రహదారుల నుంచి గల్లీల వరకు బెల్ట్ షాపులను తలపించేలా విక్రయాలు సాగుతున్నాయి. ఆటోల్లో గ్రామాలకు అక్రమ తరలింపు మద్యం సిండికేట్ ఆగడాలు పట్టణానికే పరిమితం కాలేదు. ప్రతిరోజూ ఉదయాన్నే ఆటోల్లో భారీగా మద్యం బాక్సులను లోడ్ చేసుకుని గ్రామాలకు తరలిస్తున్నారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులు కేవలం నామమాత్రపు తనిఖీలతో సరిపెడుతున్నారని, కొన్ని రకాల ఒప్పందాలతో అక్రమ విక్రయాలకు వత్తాసు పలుకుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. నాయుడుపేటలో శాంతిభద్రతలకు విఘాతం కలగకముందే సత్వరమే ఉన్నతాధికారులు స్పందించి, ఈ మద్యం సిండికేట్ ఆటకట్టించాలని ప్రజలు కోరుతున్నారు.

## తనియాలి సర్పంచ్‌ని పరామర్శించిన దువ్వూరు



దొరవారిసత్రం, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త: మండలంలోని తనియాలి గ్రామ సర్పంచ్ తుపాకుల సుబ్బమ్మ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకొని మంగళవారం మాజీ చెంగాళమ్మ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి పరామర్శించారు. రాజకీయాల దూరంగా ఉన్న తన నమ్ముకున్న ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు నేనున్నాను అని నిరూపించారు వీరితో పాటు సర్పంచులు భాస్కర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, గోపిరెడ్డి, మధురెడ్డి, శ్రీధర్‌రెడ్డి, భారతి, తదితరులు ఉన్నారు.

## సూళ్లూరుపేటలో ఆర్టీసీ కార్మికుల నిరసన

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త: రాష్ట్ర వ్యాప్తంగా 12 డిపోలను విద్యుత్ బస్సులను ప్రైవేటువారు నడిపే విధానానికి వ్యతిరేకంగా నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్టీసీ డిపో ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంయుఎ సెంట్రల్ కమిటీ సభ్యులు వినోద్‌బాబు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను తప్పుబట్టారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంయుఎ నాయకులు శేఖర్, దయాల్, సుబ్రహ్మణ్యం, షాజహాన్, రాధయ్య, కాలేషా, మూర్తి, కల్యాణ్‌కృష్ణ, ముత్యాలు, రఫీ, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు

## గిరిజన కాలనీకి రోడ్డు సమస్య పరిష్కారం



తడ, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త: గత ప్రభుత్వంలో చేనిగుంట గిరిజన కాలనీ మౌలిక వసతులు వీధిలైట్లు రోడ్లు కొరతతో ఇబ్బందులకు గురయ్యారు. వర్షాకాలం మొదలైందంటే చాలు రోడ్ల ఫైన నీరు నిలవడంతో గిరిజన కాలనీ వాసులు ఇబ్బందులు అన్నీ ఇన్ని కావు అనేక సందర్భాలలో అనేక పత్రికలలో కూడా గిరిజన కాలనీ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన అభివృద్ధికి నోచుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత తడ సొసైటీ చైర్మన్ వేనాటి శ్రీకాంత్ రెడ్డి గిరిజన కాలనీ సమస్యల పరిష్కారానికి శ్రీకారం చుట్టారు. మొదటగా వీధిలైట్లు ఏర్పాటు చేయగా ఐదు లక్షల నిధులతో సిసి రోడ్లు పనులు ప్రారంభించి వేగవంతంగా పూర్తి చేశారు.

## సూళ్లూరుపేటలో 484వ నేత్రదానం



సూళ్లూరుపేట, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త: ఆచార్య భరద్వాజ సేవాసంస్థకు మంగళవారం 484వ నేత్రదానం అందింది. సాయినగర్‌కు చెందిన పెమ్మారెడ్డి సంపూర్ణమ్మ (61) మృతిచెందారు. కుటుంబసభ్యుల అంగీకారంతో ఆమె నేత్రాల నుంచి కార్నియాలను సేకరించి చెన్నై శంకర్ నేత్రాలయకు పంపారు. ఈ కార్యక్రమంలో ఆచార్య భరద్వాజ సేవాసంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త: పట్టణంలోని చెంగాళమ్మ దేవస్థానం సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. మోటార్‌బైక్‌పై వెళుతున్న వ్యక్తి లారీని ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. తీవ్రంగా గాయపడిన యువకుడిని చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## నేడు ప్రత్యేక విద్యుత్ అదాలత్

పెళ్లకూరు, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త: రాష్ట్ర దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ నాయుడుపేట డివిజనల్ వారి ఆధ్వర్యంలో విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార వేదిక (విద్యుత్ అదాలత్)ను ఈ నల 25వ తేది బుధవారం పెళ్లకూరు మండలంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నిర్వహించబడునని, ఈ అవకాశంను పెళ్లకూరు మండలంతో పాటు ఓజిలి, నాయుడుపేట మండలాల విద్యుత్ వినియోగదారులు వినియోగించుకుని తమ దీర్ఘకాలిక విద్యుత్ సమస్యలను పరిష్కరించుకోవాలని నాయుడుపేట ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వై.శ్రీనివాసులు పత్రికలకు విడుదల చేసిన ప్రకటన ద్వారా తెలియజేశారు.

## నాయుడుపేటలో జోరుగా మై టిడిపి యాప్ ప్రచారం



నాయుడుపేట, ఫిబ్రవరి 24ప్రభాతవార్త: తెలుగు దేశం పార్టీని డిజిటల్ రంగంలో బలోపేతం చేసే దిశగా నాయుడుపేట మున్సిపాలిటీలో మై టిడిపి యాప్ ప్రచార కార్యక్రమం అట్టహాసంగా ప్రారంభమైంది. పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు, లోకేష్ బాబు, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. వార్డుల్లో యాప్ ఇన్‌స్టాలేషన్ హడావుడి నాయుడుపేట టిడిపి పట్టణ అధ్యక్షులు 786 రఫీ ఆధ్వర్యంలో 1,23,25 వార్డుల్లోని అన్ని ప్రధాన కూడళ్లలో యాప్ పోస్టర్లను ప్రదర్శించారు. పార్టీ సమాచారం ప్రజలకు నేరుగా చేరేలా ఈ యాప్ ఉపయోగపడుతుందని నాయకులు తెలిపారు.

## రైతు ధరకే టమాటాలు...ఏఎంసి విక్రయం

నాయుడుపేట, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త: ఏఎంసి చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్ ఓ ప్రకటన విడుదల చేస్తూ టమోట రైతుకి గిట్టుబాటు ధర కల్పించేదుందుకు గాను కూటమి ప్రభుత్వం రైతుల వద్దనుండి టమోటా కొనుగోలు చేసి నేరుగా వినియోగదారులకి విక్రాయించాలని అనుకోవడం జరిగిందన్నారు. అందులో భాగంగా మంగళవారం మన నాయుడుపేట వ్యవసాయ మార్కెట్ కమిటీలో మూడు టన్నుల నాటు టమోటాలు వినియోగదారుల కొరకు రైతు ధరకే విక్రయానికి సిద్ధం చేయడం జరిగిందన్నారు. మరిన్ని వివరాలుకు 9866452009 ఫోన్ నెంబర్‌ని సంప్రదించగలరని తెలియజేశారు.

## నేడు ప్రత్యేక విద్యుత్ లోక్ అదాలత్

బాలాయపల్లి, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త: స్థానిక సబ్ స్టేషన్ వద్ద 25వ తేదీ మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంకాలం ఐదు గంటల వరకు విద్యుత్ సమస్యలపై రైతులు వినియోగదారులు వచ్చే అదాలతో ఫిర్యాదు చేయవచ్చునని కోరారు. ప్రత్యేక విద్యుత్ అదాలత్‌లో చైర్ పర్సన్, విశ్రాంత జడ్జి శ్రీనివాస ఆంజనేయమూర్తి, ఆర్థిక సభ్యులు మధు కుమార్, సాంకేతిక సభ్యులు శ్రీనివాస బాబు, స్వతంత్ర సభ్యులు విజయలక్ష్మి హాజరవుతున్నట్లు వివరించారు. వెంకటగిరి సబ్ డివిజన్ పరిధిలోని బాలాయపల్లి, డక్కిలి, వెంకటగిరి పట్టణం రూరల్ పరిధిలోని వారందరూ హాజరై సమస్యలు తెలియజేయాలని కోరారు.

## రెండు మాతృ మరణాలు ఎలా జరిగాయి!

**- జిల్లా వైద్యశాఖ అధికారులతో కలెక్టర్ సుమిత్‌కుమార్ సమీక్ష**

చిత్తూరు, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త: జిల్లాలో జనవరి నెలలో రెండు మాతృ మరణాలు జరిగాయని, ఈ మాతృ మరణాలు ఎలా జరిగాయని కలెక్టర్ సుమిత్‌కుమార్ వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ప్రశ్నించారు. జిల్లాలో జనవరి నెలలో జరిగిన రెండు మాతృ మరణాలపై కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో మంగళవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సంబంధిత పిహెచ్‌సి డాక్టర్లు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ వైద్య సిబ్బంది వారి నిర్దేశిత ఆరోగ్య సేవలను కచ్చితత్వంగా అందించాలని ఆదేశించారు. గర్భస్థ సమయం నుండి గర్భిణీపై ప్రత్యేక నిఘా అవసరమని, హైరిస్క్ గర్భిణీ స్త్రీలకు గర్భస్థ సమయం నుండి కాన్పు జరిగే వరకు తప్పనిసరిగా డాక్టర్లు నాలుగు చెకప్‌లతో పాటు పౌష్టికాహారం, హైరిస్క్ లక్షణాలు, రక్తహీనత తదితరాలకు ఎప్పటికప్పుడు చికిత్స చేస్తూ అవసరమైన పెద్ద ఆసుపత్రికి రెఫర్ చేసి సులభ కాన్పు అయ్యేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో డిసిహెచ్‌ఎస్ డాక్టర్ పద్మాంజలి, డిప్యుటీ డిఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటప్రసాద్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ హనుమంతరావు, చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రి సూపరిటెండెంట్ డాక్టర్ ఉషశ్రీ, డాక్టర్ లత, డాక్టర్ ప్రవీణ, డాక్టర్ అనూష, డాక్టర్ ఆయేషా, డాక్టర్ శాలిని, డాక్టర్ ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

## వేడుకగా తిరుపతి 896వ పుట్టినరోజు ఉత్సవం



తిరుపతి,ఫిబ్రవరి 24ప్రభాతవార్త: క్రీస్తుశకం 1118 సంవత్సరంలో తిరుపతి ఆవిర్భవించినట్లు కొన్ని శాసనాలు స్పష్టంగా తెలియజేస్తున్నా, పవిత్రక్షేత్రం తిరుపతి నగర పుట్టినరోజు వేడుకలు మంగళవారం ఉదయం అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందిన తిరుపతి పుట్టినరోజు వేడుకలు ఆధ్యాత్మికభావనతో జరుపుకోవడం మరచి పోలేమని రాయలసీమ రంగస్థలం సంస్థ చైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి, మేధవులు తెలిపారు. వందలాది మంది కళాకారులు పురాణ పురుషుల వేషధారణలో తిరునగర వీధుల్లో గోవింద నామసంకీర్తనలతో భజనలు, కోలాటాలు ఆడుతూ విశేష ప్రదర్శనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నగర సంకీర్తన మండలి సభ్యులు వాసుదేవరెడ్డి, మునినాథరెడ్డి, తొండమనాటి సుబ్రహ్మణ్యంరెడ్డి, భాస్కరాచారి, అన్నారెడ్డి రాజశేఖర్, శాంబోలా హరినాథ్, మిట్టపల్లి బ్రహ్మానందం, సిద్దవరం వెంకటాద్రి, కోటి మునికృష్ణ, శ్రావణి, జయమ్మ, అరుణ, విగ్రహాల కళ్యాణి, సిద్ధమ, పద్మావతి, పార్వతి, మధు, భాస్కర్ మునేంద్రరెడ్డి, ప్రవచనకర్త చంద్రమౌళి, పురోహితుడు సురేష్ స్వామి,కొట్టే సుబ్రహ్మణ్యం రెడ్డి పాల్గొన్నారు.

## అభిప్రాయసేకరణ వ్యవస్థతోనే అద్భుత ఫలితాలు

**-టిటిడి అదనపు ఈఓ వెంకయ్యచౌదరి**



తిరుమల,ఫిబ్రవరి24ప్రభాతవార్తప్రతినిధి: అభిప్రాయసేకరణ(ఫీడ్ బ్యాక్)వ్యవస్థ ద్వారానే అద్భుత ఫలితాలనిస్తోందని, దీన్ని ఇదేవిధంగా కొనసాగించాలని టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి తెలిపారు. భక్తుల నుండి సేకరించిన అభిప్రాయాలతో తిరుమలలో ప్రజా రవాణా, అన్న ప్రసాదం, పారిశుద్ధ్య సేవలు విశేషంగా మెరుగయ్యా యని తెలిపారు.ఇదే స్ఫూర్తితో ఎఫ్ఎంఎస్, కళ్యాణకట్ట, లగేజ్ సెంటర్లపై ప్రత్యేక సమావేశం నిర్వహించి భక్తులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కార్యాచరణ రూపొందించాలని అన్నారు. పద్మావతి అతిథి గృహంలోని సుధర్మ సమావేశ మందిరంలో మంగళవారం ఆయన వివిధ విభాగాల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సిఇ సత్య నారాయణ, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, వసతి కల్పన డిప్యూటీ ఈఓ భాస్కర్, రవాణ జీఎం శేషారెడ్డి, పిఆర్ఓ నీలిమ ఇతర అధికారులు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్దలతో చక్రస్నానం



శ్రీకాళహస్తిరూరల్,ఫిబ్రవరి 24 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి మండలం తొండమాన్‌పురంలో వెలసిన శ్రీదేవి,భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం భక్తి శ్రద్దలతో చక్రస్నానం ఏర్పాటు చేసారు.టిటిడి సారధ్యంలో నిర్వహిస్తున్న తొండమాన్‌పురం ఆలయంలో ప్రతి ఏడాది వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించటం ఆనవాయితి.ఈ నేపధ్యంలో బ్రహ్మోత్సవాలకు చుట్టుపక్కల గ్రామాల నుంచి విశేష సంఖ్యలో భక్తులు హాజరౌతున్నారు.మంగళవారం ఉదయం ఆలయ ఆవరణలో చక్రస్నానం ఏర్పాటు చేసారు.స్వామి అమ్మవార్ల విగ్రహాలను చక్కగా ముస్తాబు చేసారు.ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన పెద్ద తొట్టెలో స్వామి అమ్మవార్ల విగ్రహాలకు స్నానమాచరించారు.ఈ కార్యక్రమాల్లో సూపరింటెండెంట్ జ్ఞాన శేఖర్, అర్చకులు బాబూ స్వామి,రమణస్వామి,గోపి స్వామి,మాధవస్వామి, టెంపుల్‌ఇన్స్పెక్టర్ సుధీర్, గ్రామ పెద్దలు దామోదర్‌రెడ్డి, కందాటి శేఖర్‌రెడ్డి, సంజీవయ్య, చెంగారెడ్డిలు హాజరయ్యారు. చక్రస్నానం తరువాత భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.